జిల్లాలో సాగుకు యోగ్యం కాని భూమి 5,784.37 ఎకరాలు

జనగామ చౌరస్తా, జనవరి 31 : రైతు భరోసా (పెట్టుబడి సాయం) పథకం కేవలం సాగుకు యోగ్యమైన భూములకు మాత్రమే ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ప్రకారం జిల్లాలో ఇటీవల అధికారులు సర్వే నిర్వహించారు. జిల్లాలోని 12 మండలాలు, 176 రెవెన్యూ గ్రామాల పరిధిలో (గ్రామ పంచాయతీలు 283) భూమి విస్తీర్ణం 5,784.37 ఎకరాల భూమి సాగుకు యోగ్యంగా లేదని గుర్తించినట్లు కలెక్టర్ షేక్ రిజ్వాన్‌బాషా తెలిపారు. ఈ మేరకు శుక్రవారం కలెక్టర్ ఓ ప్రకటన విడుదల చేశారు.

మండలం	రెవెన్యూ గ్రామాలు	పట్టాదారు సాగు భూమి (ఎకరాల్లో..)	సాగుకు యోగ్యంకాని భూమి (ఎకరాల్లో..)
బచ్చన్నపేట	23	44474.12	429.27
చిల్పూరు	12	29110.09	575.25
దేవరుప్పుల	13	39580.22	376.07
స్టేషన్ ఘన్‌పూర్	13	30352.38	713.3
జనగామ	20	37739.25	1120.34
కొడకండ్ల	9	22538.06	242.3
లింగాలఘనపురం	14	36799.19	571.03
నర్మెట	8	23637.26	138.03
పాలకుర్తి	21	51018.29	245.37
రఘునాథపల్లి	19	48381.12	1087.2
తరిగొప్పుల	8	17997.13	68.11
జఫర్‌గఢ్	16	30625.21	215.2
మొత్తం	176	412255.32	5784.37

ఉత్తమ పోలీసులకు ప్రశంసా పత్రాల అందజేత

కలెక్టర్ నుంచి ప్రశంసా పత్రాలు అందుకున్న వెస్ట్‌జోన్ పోలీసులు

జనగామ చౌరస్తా, జనవరి 31: వెస్ట్‌జోన్ పరిధిలో ఉత్తమ పోలీస్ ఉద్యోగులకు గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో శుక్రవారం ప్రశంసా పత్రాల ప్రదానోత్సవం జరిగింది. ముఖ్య అతిథిగా కలెక్టర్ షేక్ రిజ్వాన్‌బాషా, విశిష్ట అతిథులుగా డీసీపీ రాజమహేంద్ర నాయక్, ఏఎస్పీ పండేరి చేతన్ నితిన్ హాజరై ఏసీపీ, సివిల్, ఇంటలిజెన్స్ విభాగం సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, సబ్ ఇన్‌స్పెక్టర్లు, హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు 72 మందికి ఉత్తమ ఉద్యోగుల ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణతోపాటు ప్రజలకు సత్వర న్యాయం అందించడంలో పోలీసుల కృషి మరువలేనిది అని తెలిపారు. అంకితభావంతో పనిచేసే ఉద్యోగులకు ప్రజల్లో ప్రత్యేక గుర్తింపు ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ భీమ్‌శర్మ, సీఐలు దామోదర్‌రెడ్డి, అబ్బయ్య, ఎస్సైలు భరత్, రాజేశ్‌కుమార్, చెన్నకేశవులు, శ్వేత, సృజన్‌కుమార్ పాల్గొన్నారు.

కందుల కొనుగోలు కేంద్రం ప్రారంభం

జనగామ మార్కెట్‌లో కందుల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన కలెక్టర్

జనగామ చౌరస్తా, జనవరి 31: జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో శుక్రవారం కందుల కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మార్క్‌ఫెడ్ ద్వారా క్వింటాల్ కందులకు ప్రభుత్వ మద్దతు ధర రూ.7,550 ఉన్నట్లు తెలిపారు. జిల్లాలో కంది సాగు చేసిన రైతులు ఇక్కడే విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు. మార్క్‌ఫెడ్ ప్రమాణాల ప్రకారం రైతులు కందులను శుభ్రం చేసి ఏఈవో వద్ద ధ్రువీకరణ పత్రంతోపాటు పట్టాదారు పాస్‌బుక్, ఆధార్ కార్డు, బ్యాంకు అకౌంట్ నంబర్ జిరాక్స్‌లు తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మార్క్‌ఫెడ్ అధికారి రంజిత్‌రెడ్డి, మార్కెటింగ్ అధికారి నరేంద్ర, వ్యవసాయశాఖ అధికారి రామారావునాయక్, వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి శ్రీనివాస్, చీటకోడూరు పీఏసీఎస్ సీఈవో భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

బాలయేసు పాఠశాలలో విద్యాధికారి విచారణ

రికార్డులు పరిశీలిస్తున్న అధికారులు

దేవరుప్పుల, జనవరి 31: బాలయేసు పాఠశాల బస్సుకింద పడి గతంలో ఓ బాలుడు మృతిచెందిన ఘటనపై శుక్రవారం జనగామ విద్యాశాఖ ఏసీజీ రవికుమార్, జనగామ ఎంఈవో రాజేందర్ విచారణ చేపట్టారు. డ్రైవర్లకు లైసెన్స్‌లు లేవని, బస్సుల్లో అటెండర్లు లేక ప్రమాదం జరిగిందని, పాఠశాలలో వసతులు లేవని ఎస్ఎఫ్ఐ విద్యార్థి విభాగం పలు శాఖల అధికారులకు ఫిర్యాదు చేసింది. అధికారులు ఎలాంటి విచారణ చేయకపోవడంతో బాలయేసు పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని గురువారం ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ధర్మభిక్షం, ఉపాధ్యక్షురాలు దాసగోని సుమ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ స్పందించి జిల్లా అధికారులను పంపారు. కాగా ఏసీజీ రవికుమార్, ఎంఈవో రాజేందర్ రికార్డులను పరిశీలించారు. బస్సుల ఫిట్‌నెస్, డ్రైవర్ల లైసెన్స్‌లు, ఉపాధ్యాయుల విద్యార్హత సర్టిఫికెట్లు కావాలని కరస్పాండెంట్ జేసురాజ్‌ను అడిగారు. తాను రేపటిలోగా కార్యాలయంలో సమర్పిస్తానని తెలపడంతో విచారణ ముగించి వెళ్లినట్లు ఎంఈవో రాజేందర్ తెలిపారు.

విద్యతోనే ముందడుగు : సైకాలజిస్ట్ అశోక్

మాట్లాడుతున్న పరికిపండ్ల అశోక్

చిల్పూరు, జనవరి 31 : ఆరోగ్యమిత్ర స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని రాజవరం కేజీబీవీలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సైకాలజిస్ట్ డాక్టర్ అశోక్ మాట్లాడుతూ విద్యతోనే ముందడుగు సాధ్యమని, విద్యార్థులు ఇష్టపడి చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని, చదువు అనే నిచ్చెనతో ఎంత ఎత్తుకైనా ఎదగవచ్చని, విద్యార్థులు ఇలాంటి ప్రేరణ కార్యక్రమాలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విద్యార్థులు చదువుకునే పద్ధతులు, భయాందోళనలు ఎలా ఎదుర్కోవాలని, జీవితంలో కష్టాలు ఎలా ఎదుర్కోవాలనే విషయాలను వివరించారు. కార్యక్రమంలో సీనియర్ వైద్యులు ఆడేపు రాజేంద్రప్రసాద్, ఎస్వో ప్రశాంతి, ఉపాధ్యాయినులు సోనీ, రాధిక, హేమలత, అరుణ, సరిత పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే
ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే
ప్రకటనల విభాగం : 9182777552
HANAMKONDA 9182777563 9182777961
WARANAGAL 9182777556
JAYASHANKAR BHUPALPALLY - 9182777135
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777557
JANGAON - 9182777565

మెరుగైన వైద్య సేవలు అందించాలి

- డైరెక్టర్ ఆఫ్ హెల్త్ రవీంద్రనాయక్
- స్టేషన్ ఘన్‌పూర్ ప్రభుత్వ ఆస్పత్రి తనిఖీ

వివరాలు అడిగి తెలుసుకుంటున్న డైరెక్టర్ ఆఫ్ హెల్త్ రవీంద్రనాయక్

స్టేషన్ ఘన్‌పూర్, జనవరి 31 : రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని డైరెక్టర్ ఆఫ్ హెల్త్ రవీంద్రనాయక్ అన్నారు. డివిజన్ కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిని శుక్రవారం రాత్రి ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఆస్పత్రిలోని వార్డులు పరిశీలించి, అందుతున్న సేవలపై రోగులను అడిగి తెలుసుకున్నారు. రోజూ ఓపీ ఎంత ఉంటుంది? ఎలాంటి వ్యాధులతో వస్తున్నారు? ఎంత మందికి రక్త, మూత్ర పరీక్షలు చేస్తున్నారు? ఎలాంటి పరీక్షలు చేస్తున్నారు? జిల్లా కేంద్రంలోని టీ హబ్‌కు ఎన్ని రక్త నమూనాలు పంపుతున్నారు? తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలో పీహెచ్‌సీ, సీహెచ్‌సీల్లో ఎంత మంది వైద్యులు ఉన్నారు? రోజూ రాత్రి వేళ వైద్యులు అందుబాటులో ఉంటారా? అడిగి తెలుసుకున్నారు. జాతీయ ఆరోగ్య కార్యక్రమాలు, ఎన్‌సీడీ కార్యక్రమాలు, నార్మల్ డెలివరీలు, వ్యాక్సిన్‌లపై వైద్యులతో సమీక్ష నిర్వహించారు. ప్రైవేట్ ఆస్పత్రుల్లో ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా సౌకర్యాలు ఉన్నాయా? ధరల పట్టిక, వైద్యుల వివరాలు ఉండేలా చర్యలు తీసుకుని ప్రజలకు మెరుగైన సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌వో, డీసీహెచ్, డిప్యూటీ డీఎంహెచ్‌వోకు సూచించారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్పత్రులో రోగులకు మెరుగైన సేవలు అందించేందుకు ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహించి పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గ కేంద్రానికి జఫర్‌గఢ్, చిల్పూర్ మండలాల నుంచి కూడా రోగులు వస్తుంటారని, ఇక్కడ ఎక్స్‌రే, ఈసీజీ, డెంటల్‌కు వైద్యులు లేకపోవడంతోపాటు పోస్టుమార్టం లేక మూడు మండలాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని హెల్త్ డైరెక్టర్ దృష్టికి 'నమస్తే తెలంగాణ' తీసుకెళ్లగా త్వరలోనే ఏర్పాటుకు కృషి చేస్తానని చెప్పారు. డీఎంహెచ్‌వో మల్లికార్జున్, ప్రోగ్రాం ఆఫీసర్ రవీందర్, భాస్కర్, డీసీహెచ్‌ఎస్ వీరాంజనేయులు, డిప్యూటీ డీఎంహెచ్‌వో సుధీర్, ఫిజియోథెరపిస్ట్ రవికుమార్, రుబినా, ఆర్‌బీఎస్‌కే మెడికల్ ఆఫీసర్ అజయ్ కుమార్, ఎల్‌టీ సృజన పాల్గొన్నారు.

రిటైర్డ్ టీచర్‌కు ఎర్రబెల్లి పరామర్శ

దేవరుప్పుల, జనవరి 31: మండల కేంద్రానికి చెందిన రిటైర్డ్ టీచర్ బిళ్ల యాదవరెడ్డిని శుక్రవారం మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పరామర్శించారు. అనారోగ్యంతో హనుమకొండలోని ఓ ప్రైవేట్ దవాఖానలో చికిత్సపొందుతుండగా మాజీ మంత్రి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు. బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి చింత రవి, నాయకుడు పరశురాములు ఉన్నారు.

'సోనియాగాంధీ వ్యాఖ్యలు అవమానకరం'

దేవరుప్పుల, జనవరి 31: రాష్ట్రపతి ద్రౌపది ముర్ముపై ఓల్డ్ పూర్ లేడీ అని అనుచిత వ్యాఖ్యలు చేసిన కాంగ్రెస్ పార్టీ అధినేత సోనియా గాంధీ గిరిజన ఆదివాసీ సమాజాన్ని అవమాన పరిచారని బీజేపీ జిల్లా కార్యదర్శి దుబ్బ రాజశేఖర్ అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ అత్యున్నత పదవిలో ఉన్న ఆదివాసీ మహిళపై అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని సభ్యసమాజం తప్పుపడుతోందని, సోనియాగాంధీ బహిరంగ క్షమాపణ చెప్పాలన్నారు. కాంగ్రెస్ పార్టీకి మొదటి నుంచి ఆదివాసీ గిరిజనులపై ద్వేషమని, ద్రౌపది ముర్ముపై పోటీకి దింపడంతోనే ఆ పార్టీ వైఖరి అర్థమవుతోందన్నారు.

అండర్ పాస్ ఏర్పాటు చేయాలి

జనగామ చౌరస్తా, జనవరి 31: జనగామ పట్టణంలోని బాణాపురం బైపాస్ రోడ్డు వద్ద కొత్తగా నిర్మిస్తున్న జాతీయ రహదారిపై అండర్ పాస్ ఏర్పాటు చేయాలని సీపీఎం ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఎనిమిది రోజులకు చేరాయి. శుక్రవారం దీక్షలకు ముఖ్య అతిథిగా సీపీఐ పట్టణ కార్యదర్శి చొప్పరి సోమయ్య హాజరై మాట్లాడుతూ బాణాపురం వద్ద అండర్ పాస్ ఏర్పాటు చేయకుంటే ప్రజలకు ప్రాణాలకు ప్రమాదం ఏర్పడుతుందని తెలిపారు. ఈ విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ప్రజలందరితో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. సీపీఎం పట్టణ నాయకులు లింగం, ప్రశాంత్, మహేందర్, కవిత, రాజలక్ష్మి, సరిత, అరుణ, అనూష, ఆనందం, వసంత, నీల, పద్మ, ఈరమ్మ, రాజేశ్వరి పాల్గొన్నారు.

ఆన్‌లైన్ సెంటర్ సీజ్

పాలకుర్తి, జనవరి 31: పాలకుర్తిలో నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న ఆన్‌లైన్ సెంటర్‌ను శుక్రవారం సీజ్ చేశారు. ఆర్ఐ రాకేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలో డాక్టర్ బుచ్చిరెడ్డి దవాఖాన ఏరియాలో యాకేశ్ అనే వ్యక్తి కీర్తిక కామన్ సర్వీస్ సెంటర్ పేరుతో ఆన్‌లైన్ సెంటర్ నిర్వహిస్తున్నాడు. నిబంధనలకు విరుద్ధంగా అధిక డబ్బులు వసూలు చేస్తున్నాడు. ఆధార్ వివరాల నమోదుకు ధ్రువీరణ పత్రాలు రూపొందిస్తున్నట్లు చెప్పారు. అతడి భార్య ఓ బ్యాంక్‌లో ఆధార్ సెంటర్ నిర్వహిస్తుండటంతో నకిలీ ధ్రువీకరణ పత్రాలు రూపొందించి ఆధార్ నమోదు చేస్తున్నట్లు పేర్కొన్నారు. దీంతో రెండు ల్యాప్‌టాప్‌లు, 2 ప్రింటర్లు సీజ్ చేశామన్నారు. ఆన్‌లైన్ సెంటర్ నిర్వాహకులు ఆక్రమాలకు పాల్పడితే సహించేది లేదన్నారు.

గుండెపోటుతో ఆటోడ్రైవర్ మృతి

బచ్చన్నపేట, జనవరి 31 : మండల కేంద్రానికి చెందిన గుంటిపల్లి శ్రీనివాస్(50) శుక్రవారం గుండెపోటుతో మృతిచెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. నిరుపేద కుటుంబానికి చెందిన శ్రీనివాస్ ఇరవై ఏళ్లకు పైగా ఆటో నడుపుతూ జీవిస్తున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం గుండెనొప్పి వస్తోందని ఆస్పత్రికి తరలించేలోగా మృతిచెందాడు. మృతుడికి భార్య, పిల్లలు ఉన్నారు. తోటి ఆటో కార్మికుడు తమవంతుగా ఆర్థికసాయం అందించేందుకు ముందుకు వచ్చారు. కార్యక్రమంలో ఆటో కార్మికులు ఆటో యూనియన్ అధ్యక్షుడు పస్తం అయిలయ్య, ఎద్దు రమేశ్, సందెల లక్ష్మణ్, కరుణాకర్, సిద్దులు, భాస్కర్, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగికి విరమణ తప్పదు

నవ్యకు సుకన్య పాస్‌బుక్‌లు అందజేస్తున్న కలెక్టర్

జనగామ రూరల్, జనవరి 31: ప్రతి ఉద్యోగికి విరమణ తప్పదని, ఉద్యోగంలో ప్రజలకు సేవలు ఏవిధంగా ఉపయోగపడ్డాయే వారు గుర్తుంచుకోవాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ తెలిపారు. శుక్రవారం మండలంలోని వడ్లకొండ గ్రామ పంచాయతీ కార్యదర్శి దోర్నాల మనోహర స్వామి ఉద్యోగ విరమణ కార్యక్రమానికి హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ ఉద్యోగం చేయడం గొప్పకాదని, అవసరమయ్యే పనులు చేసి ప్రజల మదిలో ఉండాలన్నారు. మనోహరస్వామి ఉద్యోగం చేస్తూనే సామాజిక సేవలు చేస్తూ గ్రామస్తుల మనసు దోచుకున్నారన్నారు. నిరుపేద ఆడబిడ్డకు తన సొంత డబ్బులతో సుకన్య సమృద్ధి యోజన పథకంలో నవ్య అనే అమ్మాయికి 14ఏళ్లు రూ. వెయ్యి చొప్పున బ్యాంకులో జమ చేయడం సంతోషమన్నారు. నవ్య కుటుంబ సభ్యులకు పాస్‌బుక్‌లు అందజేశారు. డీఆర్డీవో పీడీ వసంత, డీపీవో స్వరూప, ఎంపీడీవో ఉప్పుగల్లు సంపత్‌కుమార్, రిటైర్డ్ డీపీవో రంగాచారి, మాజీ సర్పంచ్ బొల్లం శారద, మాజీ ఉప సర్పంచ్ గాజే అనిల్, రాష్ట్ర ఉద్యోగుల సంఘం నాయకులు సంజీవ రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, కోట వెంకటేశ్వర్లు, సిద్దిరాములు, రవీందర్‌రావు, మల్లాచారి పాల్గొన్నారు.

నీటిఎద్దడి తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

మాట్లాడుతున్నమిషన్ భగీరథ ఈఈ శ్రీకాంత్

నర్మెట, జనవరి 31: వేసవిలో తాగునీటి ఎద్దడి రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని మిషన్ భగీరథ ఈఈ వి.శ్రీకాంత్ అధికారులకు సూచించారు. ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం వేసవిలో గ్రామాల్లో నీటి సమస్యలు రాకుండా తీసుకోవాల్సిన చర్యలపై ముందస్తుగా పంచాయతీ కార్యదర్శులు, ఆర్‌డబ్ల్యూఎస్, మిషన్ భగీరథ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో వేసవిలో నీటి సమస్యలు రాకుండా తాగునీటి బోర్లు, హ్యాండ్ పంపులు మరమ్మతులు చేపట్టాలని సూచించారు. ప్రతి ఇంటికి సరిడా నీటిని అందించడమే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. ఎంపీడీవో అరవింద్, ఏఈ ప్రజ్వల్, శుక్ల పాల్గొన్నారు.

తాగునీటి సమస్యలు రాకుండా చూడాలి

జఫర్‌గఢ్: ఎంపీడీవో కార్యాయలంలో శుక్రవారం పంచాయతీ కార్యదర్శుల సమావేశంలో ఎంపీడీవో సుమన్ మాట్లాడారు. వేసవిలో తాగునీటికి ఎలాంటి సమస్యలు రాకుండా చూసుకోవాలని తెలిపారు. ఫిబ్రవరి 10వ తేదీ వరకు ఫీల్డ్ విజిట్ చేసి ఏమైనా సమస్యలు ఉంటే గుర్తించి పరిష్కరించాలని సూచించారు. ఎంపీడీవో సుమన్, ఆర్‌బ్ల్యూఎస్ ఏఈ సుకన్య, ఏఈ విజయలక్ష్మి పాల్గొన్నారు.

పాఠశాలల్లో పనులు త్వరగా పూర్తి చేయాలి

దద్దేపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని అమ్మ ఆదర్శ పనులు పరిశీలించిన స్థానిక సంస్థల కలెక్టర్ ఫర్మర్ పింకేశ్‌కుమార్

పాలకుర్తి, జనవరి 31: అమ్మ ఆదర్శ పాఠశాలల్లోని మరమ్మతులను త్వరగా పూర్తి చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫర్మర్ పింకేశ్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని దద్దేపల్లి, మల్లంపల్లి, పాలకుర్తి, విస్నూరు, చెన్నూరు ప్రభుత్వ పాఠశాలల్లోని మరుగుదొడ్లు, మంచినీటి సౌకర్యం, విద్యుత్ రిపేర్లతో పాటు పాఠశాలల్లోని మైనర్ రిపేర్లను త్వరగా పూర్తి చేయాలన్నారు. వీటితోపాటు అంగన్‌వాడీల్లోని రిపేర్లను త్వరగా పూర్తి చేయాలని సంబంధిత శాఖ అధికారులు ఆదేశించారు. పనుల్లో ఆలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. పనులను త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు. 15రోజుల్లో ఆకస్మిక తనిఖీ చేస్తానన్నారు. పనుల్లో పురోగతి ఉండాలన్నారు. ఎంపీడీఓ ఆవుల రాములు, ఎంఈఓ పోతుగంటి నర్సయ్య, పెనుగొండ రమేశ్, పాయం శోభరాణి, పుస్కూరు రమేశ్‌రావు పాల్గొన్నారు.

'బీసీ రాజకీయ యుద్ధభేరి'ని విజయవంతం చేయాలి

శివునిపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న బీసీ సంఘం నాయకులు

స్టేషన్ ఘన్‌పూర్/ చిల్పూర్, జనవరి 31 : హనుమకొండలోని ఆర్ట్స్ కాలేజీ గ్రౌండ్‌లో ఆదివారం జరిగే బీసీ రాజకీయ యుద్ధభేరిని విజయవంతం చేయాలని మున్నూరు కాపు సంఘం రాష్ట్ర కార్యదర్శి చిగురు విజయ్, బీసీ సంక్షేమ సంఘం జిల్లా నాయకుడు పోశాల కృష్ణ, జీఎంపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు మేకల మల్లేశం పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని శివునిపల్లిలో ర్యాలీ నిర్వహించారు. వారు మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు అవుతున్నా బీసీలు బానిసలుగా బతుకుతున్నారని తెలిపారు. బీసీలు అభివృద్ధికి, అధికారానికి దూరం చేశారని పేర్కొన్నారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ ద్వారా సుమారు 60 లక్షల మంది బీసీ యువతకు నిరుపయోగంగా మారిందన్నారు. 3శాతం ఉన్న ఓసీలకు 10శాతం, 25శాతం ఉన్న బీసీలకు 29శాతం రిజర్వేషన్లు ఇస్తుండటం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్, బీసీలకు రాజ్యాధికారం సాధించేందుకు బీసీ రాజకీయ యుద్ధభేరిని విజయవంతం చేయాలని కోరారు. కుమ్మం సతీష్, అంజద్ బాషా, కుమ్మం ఉపేందర్, పింగిలి భిక్షపతి, ఆరెళ్లి అశోక్, నీల రాములు, బూర్ల రాజు, రాజన్‌బాబు, బండారి రవి, గోరంతల మధు, సంపత్, నగేష్, నరసింహచారి, గుర్రం పాతికుమార్, అనిల్, మారేడుపాక నరసింహచారి పాల్గొన్నారు.

చిల్పూరు మండలం చిన్నపెండ్యాలలో బీసీ సంక్షేమ సంఘం చిల్పూర్ మండల అధ్యక్షుడు బత్తుల రాజన్ బాబు బీసీ రాజకీయ యుద్ధభేరిని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు రిజర్వేషన్ 42శాతానికి పెంచాలని, ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ముదిరాజ్ మహాసభ పోస్టర్‌ను చిల్పూర్ మండల ముదిరాజ్ మండల అధ్యక్షుడు కండ్లకోలు శ్రీనివాస్ ముదిరాజ్ ఆవిష్కరించారు. అలుగు అశోక్, జంగిటి కుమార్, కొత్తపల్లి యాకరాజు, సొప్పరి రాజు, కండ్లకోలు బాలరాజు, అలుగు నాగరాజు, పిట్టల రవి, నరబోయిన కనకరాజు, అలుగు నాగరాజు పాల్గొన్నారు.

ఎన్‌ఓసీ, ఇంటి పేపర్లు ఇవ్వకుండా వేధింపులు

ఓ ఫైనాన్స్ సంస్థపై సీపీకి బాధితుడి ఫిర్యాదు

బ్యాంకు స్టేట్‌మెంట్ చూపుతున్న రాజు

స్టేషన్ ఘన్‌పూర్, జనవరి 31 : ఇంటి లోన్‌ను వన్‌టైమ్ సెటిల్‌మెంట్ కింద పూర్తిగా చెల్లించినప్పటికీ ఎన్‌ఓసీ, ఇంటి పత్రాలు ఇవ్వకుండా, లోన్ క్లియర్ కాలేదని, పూర్తిగా చెల్లించాలని ఓ ఫైనాన్స్ సంస్థ ఇబ్బందులకు గురిచేస్తోంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. స్టేషన్‌ఘన్‌పూర్ డివిజన్ కేంద్రానికి చెందిన గోనెల రాజు శ్రీరాం సిటీ ఫైనాన్స్ కాజీపేట బ్రాంచిలో 2021లో 60 నెలల కాల పరిమితితో రూ.13లక్షలు హోంలోన్ తీసుకున్నాడు. ప్రతి నెల రూ.40వేల చొప్పున 32నెలలు చెల్లించాడు. మరో ఫైనాన్స్‌లో లోన్ తీసుకునేందుకు వన్‌టైం సెటిల్‌మెంట్ కింద 2023, సెప్టెంబర్ 15న రూ.లక్ష ఫోన్ పే, చెక్ ద్వారా రూ.9లక్షలు బ్రాంచి మేనేజర్ రఘుకు చెల్లించాడు. ఎన్‌వోసీ, ఇంటి పత్రాలు ఇవ్వాలని అడిగితే లోన్ క్లియర్ చేయాలని బ్రాంచి డీఎం తెలిపాడు. దీంతో బాధితుడు వరంగల్ సీపీకి ఫిర్యాదు చేశాడు.

గొడ్డలితో దాడి చేసిన నిందితుడిపై కేసు

జఫర్‌గఢ్, జనవరి 31: గొడ్డలితో దాడిచేసిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేసిన ఘటన శుక్రవారం జరిగింది. ఎస్సై బి. రామ్‌చరణ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఉప్పుగల్లుకు చెందిన అబ్బురబోయిన రవి పాత కక్షలను మనసులో పెట్టుకొని జనవరి 30 రాత్రి 10గంటలకు అదే గ్రామానికి బండి రేణుక ఇంటికి వెళ్లాడు. ఇంటి బయట ఉన్న గొడ్డలితో దాడి చేశాడు. అడ్డు వచ్చిన తల్లిని గొడ్డలితో కొట్టాడు. రేణుకకు తీవ్ర గాయాలయ్యాయి. బాధితురాలి ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చీటింగ్ కేసులో ఇద్దరిపై..

తరిగొప్పుల, జనవరి 31: చీటింగ్ కేసులో పోలీసులు ఇద్దరిపై కేసు నమోదు చేయగా, అందులో ఒకరిని రిమాండ్ చేశారు. ఎస్సై శ్రీదేవి శుక్రవారం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. మండలంలోని మార్యాపురానికి చెందిన బీరెడ్డి ఇన్నారెడ్డి రూ.79లక్షలు, అల్లం శైలజ నుంచి రూ.42లక్షలు, అదే గ్రామానికి చెందిన వ్యక్తులు, బంధుమిత్రుల నుంచి అవసర నిమిత్తం సుమారు రూ.2కోట్ల 66లక్షలు అదే గ్రామానికి చెందిన బీరెడ్డి అనిల్‌రెడ్డి భార్య మరియాలీనా తీసుకున్నారు. డబ్బులు తిరిగి అడిగాతే మూడేళ్లు తప్పించుకొని తిరుగుతూ విసుగుచెంది బీరెడ్డి ఇన్నారెడ్డి, అల్లం శైలజ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రంగంలోకి దిగిన ఎస్సై హైదరాబాద్‌లో నివసిస్తున్న అనిల్‌రెడ్డి భార్య మరియాలీనాని అరెస్ట్ చేసి జనగామ కోర్టులో రిమాండ్ చేశారు. మరియాలీనాకి 14రోజుల పాటు జైలుశిక్ష విధించారని ఎస్సై తెలిపారు. పరారీలో ఉన్న అనిల్‌రెడ్డిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులను సన్మానిస్తున్న డ్రైవర్ల నాయకులు

టీఎన్జీవోస్ జిల్లా నాయకులకు ఘన సన్మానం

జనగామ చౌరస్తా, జనవరి 31: కలెక్టరేట్‌లోని టీఎన్జీవోస్ కార్యాలయంలో ఆ సంస్థ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎండీ ఖాజా షరీఫ్, పెండెల శ్రీనివాస్‌ను శుక్రవారం శాలువా, పూలదండలతో ఉమ్మడి వరంగల్ జిల్లా డ్రైవర్ల సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు. ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారంతోపాటు వారి సంక్షేమానికి జిల్లాలో అహర్నిశలు కృషి చేస్తున్న ఖాజా, శ్రీనివాస్‌కు డ్రైవర్లు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఉమ్మడి వరంగల్ జిల్లా డ్రైవర్ల సంఘం అధ్య